

టీ-హబ్‌లో పరీక్షల నిలుపుదలపై
వైద్యాధికారుల ఆరా!

- యంత్రం మరమ్మతులకు రంగంలోకి ఇంజనీర్
- టీ-హబ్ వాహనాలపై త్వరలో విచారణ?

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి అర్బన్, జూన్ 15 : సంగారెడ్డి జీజీహెచ్‌లోని టీ-డయాగ్నోస్టిక్ హబ్‌లో బయోకెమిస్ట్రీ యంత్రం మొరాయింపుపై వైద్యాధికారులు ఆరా తీశారు. 'హబ్‌కు జబ్బు' అనే శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి వారు స్పందించారు. యంత్రం మొరాయింపు, రక్త పరీక్షల నిర్ధారణ నిలిచిపోవడం తదితర వివరాలను ల్యాబ్ మేనేజర్ ద్వారా జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి ఆరా తీశారు. తరచూ యంత్రం బ్రేక్‌డౌన్‌పై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. హబ్‌లో యంత్రం పాడై పరీక్షలు నిలిచిపోవడంపై జీజీహెచ్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.అనీల్‌కుమార్ సీరియస్‌గా తీసుకున్నారు. వెంటనే ఇంజనీర్‌ను రంగంలోకి దించి మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకున్నారు. బయోకెమిస్ట్రీ యంత్రంలో సాఫ్ట్‌వేర్ సమస్య తలెత్తిన నేపథ్యంలో త్వరలో మిషన్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ఆయన చర్యలు చేపట్టారు. అంతేకాకుండా టెస్టుల కోసం బయటకు వెళ్లిన గర్భిణి కుటుంబసభ్యులతో ఆయన మాట్లాడారు. 'ఆంధ్రజ్యోతి' కథనంపై కలెక్టర్‌తో పాటు వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ కూడా ఆరా తీసినట్లు తెలిసింది. శాంపిల్ వాహనాల తరలింపులో భాగంగా తొమ్మిది వాహనాలకు ఆరు నుంచి ఎనిమిది వాహనాలే నిత్యం హబ్‌కు వస్తున్నాయి. త్వరలో ఆ వాహనాలతో పాటు ల్యాబ్ నిర్వాహకుడి పాత్రపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టే అవకాశం ఉందని ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

మాటూర్ చక్కెర కర్మాగారం
క్రషింగ్‌కు సిద్ధం చేసేలా కృషి

- డిప్యూటీ కేన్ కమిషనర్ నర్సిరెడ్డి



రైతులతో మాట్లాడుతున్న డిప్యూటీ కేన్ కమిషనర్ నర్సిరెడ్డి

జహీరాబాద్, జూన్ 15 : రాయికోడ్ మండలంలోని మాటూర్‌లో నిర్మితమవుతున్న చక్కెర కర్మాగారం ఈ ఏడాది క్రషింగ్‌కు సిద్ధం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని డిప్యూటీ కేన్ కమిషనర్ నర్సిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వారు పట్టణంలోని సీడీసీ కార్యాలయంలో చెరకు రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మాటూర్‌లో నిర్మిస్తున్న చక్కెర పరిశ్రమ పనులను పరిశీలించామన్నారు. నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నామని, నవంబర్‌లో నాటికి సిద్ధమవుతుందని తెలిపారు. జహీరాబాద్‌లో ట్రైడెంట్ చక్కెర కర్మాగారం మూతపడడంతో నియోజకవర్గ పరిధిలోని రైతులకు ఇబ్బందిగా మారిందన్నారు. రాయికోడ్‌లో చక్కెర కర్మాగారంతో ఇక్కడ చెరకు రైతుల సమస్యలకు కొంతమేరకు పరిష్కారం లభిస్తుందన్నారు. జహీరాబాద్ ప్రాంత రైతులు ఈ కర్మాగారానికి చెరకును తరలించడంపై అధికారులు అభిప్రాయాలను సేకరించారు. చెరకు పంటను పొలాల్లో నుంచి రూపుచేయడానికి కూలీలను ఏర్పాటు చేయాలని రైతులు అధికారులను కోరారు. వీలును బట్టి అందుబాటులో ఉన్న కర్మాగారాలకు పంటను తరలించుకుంటామని పలువురు రైతులు వివరించారు. సమావేశంలో బోధన్, సంగారెడ్డి అసిస్టెంట్ కేన్ కమిషనర్ వెంకటరవి, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

చేపపిల్లల పంపిణీ లేనట్టేనా?





వంద శాతం రాయితీపై ప్రతీ ఏటా సరఫరా
వానాకాలం ప్రారంభమైనా సర్కారు నుంచి స్పష్టతేదీ?
జాడలేని టెండర్‌లు... ఆందోళనలో మత్స్యకారులు

మెదక్ అర్బన్, జూన్ 15: మత్స్యకారుల జీవనోపాధి కోసం ప్రభుత్వం ఏటా ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపడుతోంది. జిల్లాలో గుర్తించిన చెరువులు, కుంటల్లో చేప పిల్లలను వదిలేందుకు మత్స్యశాఖ ఏర్పాట్లు చేస్తుంటోంది. అయితే రాష్ట్రంలో సర్కార్ మారడంతో ఈసారి వందశాతం రాయితీ ఉంటుందో లేదో ప్రశ్నార్థకంగా మారింది.

ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూపు

ప్రతీ ఏడాది జూన్ నుంచి ఆగస్టులోగా చేప పిల్లల పంపిణీ పూర్తి చేసేవారు. కానీ ఇప్పటికీ ఈ ప్రక్రియ కొనసాగింపుపై అడుగు ముందుకుపడలేదు. దాంతో మత్స్యకారుల్లో ఆందోళన నెలకొన్నది. గత ప్రభుత్వం 2016 సంవత్సరం నుంచి ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని అమలు చేస్తోంది. అందులో భాగంగా మెదక్ జిల్లా వ్యాప్తంగా దాదాపు 5 కోట్ల 40 లక్షల చేప పిల్లల సీడ్ ఉచితంగా అందించేవారు. జిల్లాలో 1,614 చెరువులు ఉండగా, 272 మత్స్య సహకార సంఘాల్లో 17,500 మంది మత్స్యకారులకు లబ్ధి చేకూరేది. ఈ ఏడాది ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

ఈసారి ఊసేలేదు

జూన్ నెల సగం పూర్తయినప్పటికీ ప్రభుత్వం చేపల సీడ్ కోసం టెండర్లను ఆహ్వానించకపోవడంతో అసలు సీడ్ పంపిణీ ఉంటుందా..? లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. గతేడాది వరకు వానాకాలం సీజన్ ప్రారంభం కాకముందే ఉచిత చేప పిల్లల పంపిణీ కోసం ఏర్పాట్లు జరిగేవి. జూన్ ఆరంభంలో టెండర్లను పిలిచి తక్కువ ధరకు

ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది



ఉచిత చేప పిల్లల పంపిణీపై ప్రభుత్వ నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా ప్రక్రియ ఆగింది. ఉన్నతాధికారుల మార్గదర్శకాల మేరకు కార్యాచరణ చేపడుతాం. గతంలో మాదిరిగా ఉచితంగానా? రాయితీపై ఇస్తారా? అనేది సర్కార్ నిర్ణయించాల్సి ఉంటుంది.

- నరసింహారావు, మెదక్ జిల్లా మత్స్యశాఖ అధికారి

ఆలస్యమైతే కష్టమే!

కిలో చేప పిల్ల పెరగాలంటే కనీసం ఆరు నెలల సమయం పడుతోంది. జూన్, జూలై నెలల్లో వదిలితేనే డిసెంబర్ నుంచి వేటకు అనుకూలంగా ఉంటుంది. ఇంకా సమయం ఉంటే ఓ నాలుగు నెలల పాటు పట్టుకునేందుకు వీలుంటుంది. ఆలస్యమైతే పిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపుతోంది. ఇందులో 45 రోజుల వయసు ఉన్నవి(35-40 ఎంఎం) ఎక్కువగా, 75 రోజుల వయసున్నవి పెద్ద సైజు పిల్లలు(80-100) తక్కువగా వంద శాతం రాయితీ కింద అందించేవారు. ఇప్పుడు ఆలస్యమైతే వేసవిలో ఎండల కారణంగా నీరింకి చేపలు మృతి చెందే ప్రమాదం ఉంటుంది.

పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయాలి

- 1-19 లోపు వయస్సున్న వారికి ఇవ్వాలి
- 20వ తేదీన వేసుకోని వారికి 27న కచ్చితంగా అందించాలి
- మాత్రల పంపిణీపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



నులి పురుగుల నివారణ దినోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, జూన్ 15 : ఆరోగ్య సమాజాన్ని నిర్మించేందుకు పిల్లలందరికీ అల్బెండజోల్(నులి పురుగుల నివారణ) మాత్రలు వేయాలని అధికారులను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం 1-19 సంవత్సరాల పిల్లలందరికీ అల్బెండజోల్ టాబ్లెట్ వేయించాలని, నులి పురుగులతో వచ్చే అనారోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖ, కేజీబీవీ వసతి గృహాల్లోని విద్యార్థులందరికీ మాత్రలు వేయాలన్నారు. జిల్లాలో 4,05,207 మంది పిల్లలు ఉన్నారని, ఈ నెల 20వ తేదీన పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేలయాని, 20న వేసుకోలేని పిల్లలకు 27వ తేదిన కచ్చితంగా వేయించాలన్నారు. 1 నుంచి 5 సంవత్సరాల పిల్లలకు అంగన్వాడీ పరిధిలోకి వస్తారని వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు నులి పురుగులతో వచ్చే అనారోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. శానిటేషన్ వాహనాలతో ప్రచారం నిర్వహించాలని, అల్బెండజోల్ మాత్రల పంపిణీపై గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమీక్ష సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ గాయత్రిదేవి, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, డీఈవో వెంకటేశ్వర్లు, డీఐవో గోవింద్‌రామ్, ప్రోగ్రామ్ అధికారి డా.శశాంక్, డీసీహెచ్‌వో డా.చక్రపాణి, ఏపీవో బాలరాజ్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జీజీహెచ్‌లో మెడికల్ బోర్డు



ఉపాధ్యాయుడికి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న సూపరింటెండెంట్

సంగారెడ్డి అర్బన్, జూన్ 15 : సంగారెడ్డి జీజీహెచ్‌లో శనివారం మెడికల్ బోర్డును ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే, బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, ఎల్పీ, పీఈటీ ఉపాధ్యాయులు ప్రిఫరెన్షియల్ కేటగిరి, మెడికల్ కేటగిరిలో ఏమైనా చేర్పులు చేసుకునేందుకు మెడికల్ బోర్డులోని డాక్టర్ల ద్వారా ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. 23 మంది హాజరుకాగా, 15 మందికి బోర్డు ధృవీకరించి సర్టిఫికెట్లను జారీ చేసినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనీల్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

- మిషన్ భగీరథ ఇంటింటీ సర్వేను వేగవంతం చేయాలి
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూన్ 15 : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందుతుందని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. శనివారం ఆయన మెదక్, మక్తభూపతిపూర్ గ్రామంలో బడిబాట, మిషన్ భగీరథ ఇంటింటా సర్వే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి నాగరికతలకు, పోటీ ప్రపంచంలో మనుగడ సాధించడానికి విద్య ప్రాముఖ్యత అవసరమన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, జిల్లా సెక్టోరియల్ అధికారి సుదర్శనమూర్తి, ఎంఈవో నీలకంఠం, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మిషన్ భగీరథ ఇంటింటి సర్వే ద్వారా సేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సర్వేకు సంబంధించిన వివరాలను లబ్ధిదారుల నుంచి సేకరించాలని సర్వే టీంలకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 1,60,918 ఇళ్లకు 99,206 ఇళ్లల్లో ఇప్పటి వరకు 61.68 శాతం సర్వే పూర్తయిందన్నారు.



మక్తభూపతిపూర్ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



లీకేజీ ఏర్పడడంతో ఎక్స్‌కవేటర్‌తో తవ్విస్తున్న రోడ్డు

ఎక్కడపడితే అక్కడ లీకేజీలు

మెదక్ జిల్లా కేంద్రంలో రోడ్లు ధ్వంసం.. రోజుల తరబడి మరమ్మతులు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 15 : మిషన్ భగీరథ పైపుల లీకేజీ మెదక్ పట్టణంలో తలనొప్పిగా మారింది. ఎక్కడపడితే అక్కడ లీకేజీలు ఏర్పడుతుండడంతో రోడ్డు ధ్వంసం చేసి మరమ్మతులను చేపట్టాల్సి వస్తుంది. ఈ పనులు రోజుల తరబడి సాగుతుండడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఓ చోట మరమ్మతు చేయగానే మరోచోట పైపులైన్ లీకేజీలు ఏర్పడుతున్నాయి.

రూ.60 కోట్లతో పైపులైన్

జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలో 32 వార్డులు ఉండగా.. దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్ వ్యవస్థను మార్చి.. దాని స్థానంలో మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా గతంలో ఏర్పాటు చేసిన హెచ్‌డీపీ సిమెంట్ పైపులైన్లను తొలగించి వాటి స్థానంలో డీపీ లైన్‌లను ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారుల్లో ఎమ్మెస్‌బీడ్ పైపులైన్ వేస్తూ.. కాలనీలల్లోకి అనుసంధానించారు. పట్టణంలోని 32 వార్డుల్లో 130 కిలో మీటర్ల మేర నూతన పైపులైన్ వ్యవస్థను నిర్మించారు. పాత వాటిని డమ్మీగా చేసి కొత్త పైపుల ద్వారా ఇంటింటికి నీరందిస్తున్నారు. ట్యాంకుల నిర్మాణానికి గాను మొదటగా రూ.50 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. విలీన గ్రామాలైన అవుసులపల్లి, పిల్లికోటాల్, ఔరంగాబాద్ గ్రామాలకు కూడా ఇంటింటికి తాగునీరు అందించేందుకు గాను మరో రూ.10 కోట్ల నిధులను అదనంగా కేటాయించారు. మొత్తంగా రూ.60 కోట్లతో వేసిన పైపులైన్‌లు కొన్నాళ్లకే లీకేజీలు ఏర్పడుతుండడంపై పట్టణవాసులు మండిపడుతున్నారు. పైపులైన్ పనులు పూర్తకయ్యాక ప్రధాన రహదారిపై మరో రూ.50 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు.

నూతన పైపులైన్ ద్వారానే నీటి సరఫరా

మెదక్ పట్టణంలో గతంలో 4,800 తాగునీటి కనెక్షన్లు ఉండగా..నూతనంగా మరో 4,100 కనెక్షన్‌లు ఇచ్చినట్లు అధికారుల తెలిపారు. గత ఏప్రిల్ మాసం నుంచి ప్రతీ కుళాయికి రూ.200 వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తిగా మిషన్ భగీరథ నూతన పైపులైన్ వ్యవస్థ ద్వారానే నీటిని సరఫరా చేస్తున్నారు. కొన్ని కుటుంబాల్లో అన్నదమ్ముళ్లు వేరుంటుండగా, ఎవరి కనెక్షన్ వారికి ఇవ్వాలని కోరడంతో వాళ్ల ఆధార్ కార్డుల ఆధారంగా రెండు, మూడు నల్లా కనెక్షన్లు ఇవ్వడం జరిగింది. ఇలా ఇచ్చిన ప్రతీ ఒక్కరికి కనెక్షన్ల ఆధారంగా ప్రతి నెల రూ.200 వసూలు చేస్తున్నారరు.

తవ్వేస్తున్నారు

పైపులైన్ వేసిన కొద్ది రోజులకే ప్రధాన రహదారులపై లీకేజ్‌లు ఏర్పడుతుండడంతో ఎక్కడపడితే అక్కడ నూతనంగా వేసిన బీటీ రోడ్డును తవ్వేస్తున్నారు. హెడ్ పోస్టాఫీసు నుంచి నర్సాపూర్ వెళ్లే మార్గంలో పట్టణ ప్రధాన రహదారిపై ఇప్పటికే దాదాపు పదిచోట్ల లీకేజ్‌ల పేరుతో రోడ్డును ధ్వంసం చేశారు. రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు పెడుతూ రోజుల తరబడి మరమ్మతులు చేస్తున్నారు. అయినప్పటికీ సమస్య తీరకపోగా చేసిన చోటే మళ్లీ లీకేజ్‌లు ఏర్పడుతున్నాయి. పైపులైన్ల విస్తరణ సమయంలో అధికారుల సమన్వయం లోపం కారణంగా లీకేజీలు ఏర్పడుతున్నాయని పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



మరమ్మతుల అనంతరం మట్టితో కప్పి వదిలేసిన లీకేజీ ప్రాంతం

తల్లిదండ్రులను హత్యచేసిన
కుమారుడికి రిమాండ్

- గొంతునులిమి పెట్రోల్ పోసి నిప్పంటించిన కొడుకు
- జల్సాలకు అలవాటు పడి అప్పులపాలు.. డబ్బు కోసం చంపిన వైనం
- గత నెల 19న చోటుచేసుకున్న ఘటన
- నిందితుడి తీరుపై గ్రామస్థులకు అనుమానం
- పోలీసులకు సమాచారమివ్వడంతో విచారణ
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకట్‌రెడ్డి

7లో

అంగన్‌వాడీల ద్వారా
కుటుంబ సర్వే

- ప్రత్యేక యాప్ ద్వారా వివరాల సేకరణ
- మెదక్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బ్రహ్మాజీ

7లో

మూడు ప్రైవేట్ పాఠశాలలకు
షోకాజ్ నోటీసులు

- సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

● ఉన్నత విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి. రాజేందర్‌సింగ్


కళాశాలలోని పరిశోధన శాలను పరిశీలిస్తున్న రాజేందర్‌సింగ్

గజ్వేల్, జూన్ 15: ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి. రాజేందర్‌సింగ్ పేర్కొన్నారు. గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతున్నదని, ప్రభుత్వ కళాశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు దోస్త్ ద్వారా అడ్మిషన్స్ పొంది, తగిన కోర్సులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో మళ్లీ కో-ఎడ్యుకేషన్ ప్రారంభమైందని తెలిపారు. ఆయనవెంట ఆడిట్ అధికారులు దీపక్‌కుమార్, ముఖేష్‌కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ గణపతిరావు, అధ్యాపకులు ఎస్.రమేశ్‌బాబు, బాలరాజు, విజయభాస్కర్‌రెడ్డి, రామచంద్రం, పెద్దిరాజు, కవిత, లక్ష్మీనరసయ్య, మార్కండేయ, ఓం ప్రకాశ్, విష్ణుమూర్తి ఉన్నారు.

రాశి సీడ్స్ కంపెనీ భారీ మోసం

- రైతులకు విత్తనోత్పత్తి విత్తనాల సరఫరా
- పంట దిగుబడి రాకపోతే నష్టపరిహారం చెల్లిస్తానని బాండ్ పేపర్ రాసిచ్చిన సీడ్స్ ఆర్గనైజర్
- పంట దిగుబడి రాకపోవడంతో చేతులెత్తేసిన వైనం
- ఆందోళనలో రైతులు





సాగుచేసిన ఆడ, మగ వరి పంట (ఫైల్), అక్కన్నపేటలో ఆర్గనైజర్ రాసిచ్చిన బాండ్ పేపర్, విత్తనాల బ్యాగులను చూపుతున్న రైతులు

అక్కన్నపేట, జూన్ 15: గ్రామాల్లోని రైతులను టార్గెట్ చేస్తూ.. మాయ మాటలు చెప్పి దిగుబడి రాకపోతే నష్టపరిహారం చెల్లిస్తానంటూ బాండ్ పేపర్ సైతం రాసిచ్చిన సీడ్స్ ఆర్గనైజర్.. రైతులు సాగుచేసిన వరి విత్తనోత్పత్తి పంట దిగుబడి రాకపోవడంతో చేతులెత్తేశాడు. ఈ సంఘటన అక్కన్నపేట మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకున్నది. వరి విత్తనోత్పత్తి పంట సాగుచేసిన రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్కన్నపేట మండలం అంతకపేట గ్రామంలో రేషన్ డీలర్‌గా పనిచేస్తున్న బదనాపురం మొగిలి సీడ్స్ ఆర్గనైజర్‌గా పలు గ్రామాల్లో రైతులకు వరి విత్తనోత్పత్తి, మొక్కజొన్న విత్తనాలను సరఫరా చేశాడు. ఇందులో భాగంగా అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన రైతులతో సమావేశమయ్యాడు. రాశి సీడ్స్ కంపెనీకి చెందిన టీపీఆర్‌ఎచ్ 3-23ఆర్‌ఎస్ అనే వెరైటీ గల ఆడ, మగ వరి విత్తనాలను సాగుచేయాలని, ఎకరానికి 15 క్వింటాళ్లపైన దిగుబడి వస్తుందని చెప్పాడు. క్వింటాల్‌కు ధర రూ.5,800 చెల్లిస్తామని, ఒకవేళ పంట దిగుబడి రాకపోతే ఎకరానికి 15 క్వింటాళ్ల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తానని బాండ్ పేపర్ సైతం రాసిచ్చాడు. దీంతో రైతులు ఆడ, మగ వరి పంట సాగుచేశారు. ఆర్గనైజర్‌తో పాటు రాశి సీడ్స్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్లు చెప్పిన విధంగా పంటకు పెస్టిసైడ్స్, ఎరువులు వేశామని, పంటలో బెరుకులు వస్తే కూడా తీసి వేశామని చెప్పారు. తీరా పంట హార్వెస్టింగ్ చేసిన తర్వాత ఆర్గనైజర్ చెప్పిన విధంగా దిగుబడి రాలేదు. ఎకరానికి 6 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. సరే బాండ్ పేపర్ రాసిచ్చాడు కదా అని నమ్మిన రైతులు పండించిన ధాన్యాన్ని ఆర్గనైజర్‌కు విక్రయించారు. తీరా ఇప్పుడు ఆర్గనైజర్ బాండ్ పేపర్ ప్రకారం కాకుండా రైతులు పండించిన ధాన్యానికి మాత్రమే డబ్బులు చెల్లిస్తానని చెపుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మీరు రాసిచ్చిన బాండ్ పేపర్ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని ఆర్గనైజర్‌ను రైతులు అడగడంతో 'నేను ఇవ్వను.. ఏం చేసుకుంటారో చేసుకోండి... ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండి..' అంటూ దురుసుగా మాట్లాడుతున్నారని రైతులు వాపోయారు. 'నేను చెప్పింది వినక ఒకవేళ మీడియాకు చెప్పి పేపర్‌లో వస్తే ఒక్క రూపాయి కూడా ఇవ్వను.. ఇక మీ ఇష్టం అంటూ బెదిరిస్తున్నాడు' అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పోలీసులకు, వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. వారు స్పందించి సీడ్స్ ఆర్గనైజర్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

రూ.లక్ష పెట్టుబడితో సాగు చేశాను



3 ఎకరాల్లో ఆడ, మగ వరి పంటను సాగుచేశాను. కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్లు, ఆర్గనైజర్ చెప్పిన విధంగా మందులు, ఎరువులు వేశాను. రూ.లక్ష పెట్టుబడి పెట్టాను. ఆర్గనైజర్ చెప్పిన విధంగా దిగుమతి రాలేదు. బాండ్ పేపర్ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని అడిగితే ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ బెదిరింపులకు దిగుతున్నాడు. అధికారులు స్పందించి ఆర్గనైజర్ పై చర్యలు తీసుకుని నష్టపరిహారం ఇప్పించాలి.

\- మిట్టపల్లి శంకర్, రైతు, అక్కన్నపేట

దిగుబడి వస్తే అప్పులు తీర్చాలనుకున్న



మూడు ఎకరాల్లో ఆడ, మగ వరి పంటను సాగుచేశాను. పెట్టుబడికి కూడా భయపడకుండా రూ.లక్ష వరకు అప్పులు తెచ్చి పెట్టాను. పంట దిగుబడి బాగా వస్తే చెల్లెలి పెళ్లికి చేసిన అప్పులు తీర్చాలనుకున్న. తీరా చూస్తే పంట దిగుబడి రాలేదు. అప్పులు మిగిలాయి. నష్టపరిహారం ఇవ్వాలని ఆర్గనైజర్‌ను అడిగితే నేను ఇచ్చినంత తీసుకోవాలంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

\- పోలు సురేష్, రైతు, అక్కన్నపేట

బాబోయ్.. అంగడిలో దొంగలు

- ప్రతీ శుక్రవారం 10 వరకు సెల్‌ఫోన్ల చోరీ..
- అంగడికి రావాలంటే జంకుతున్న సెల్ వినియోగదారులు
- పోలీసు నిఘా ఏర్పాటు చేయాలని ప్రజల వేడుకోలు

హుస్నాబాద్, జూన్ 15: హుస్నాబాద్ పట్టణంలో వార సంత జరిగే ప్రతి శుక్రవారం సెల్ ఫోన్ దొంగలు రెచ్చిపోతున్నారు. ప్రతి వారం 5 నుంచి 10 వరకు సెల్‌ఫోన్లను చోరీ చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్లో బాధితుల ఫిర్యాదులు వారవారం పెరిగిపోతున్నాయి. గడిచిన ఈ మూడు నాలుగు వారాల్లోనే అంగడిలో 30 వరకు సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నట్లు బాధితులు వాపోయారు. హుస్నాబాద్ పట్టణంలోని రామవరం రోడ్డు నుంచి అక్కన్నపేట మార్కెట్ రోడ్డులో కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులు విక్రయిస్తుంటారు. అంగడి రోజు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో ఈ రోడ్డు కిక్కిరిసిపోతుంది. సంతకు వచ్చిన వారు కూరగాయలు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తున్న క్రమంలో ఒక ముఠా వారి పక్కనే ఉండి సెల్‌ఫోన్‌లు దొంగిలించి ఒకరి నుంచి మరొకరి ద్వారా బయటకు చేరవేస్తుంటారని తెలిసింది. అయితే ఈ చోరీకి పాల్పడే వారు మైనర్లు అనేది సమాచారం. ఈ సెల్‌ఫోన్ల చోరీలతో ప్రజలు అంగడికి రావాలంటే భయపడిపోతున్నారు. సంతలో ఇలాంటివి జరుగకుండా జాగ్రత్తలు చేపట్టడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఈ చోరీలను కట్టడి చేసేందుకు అంగడి రోజు మైక్ ద్వారా అనౌన్స్ చేస్తే బాగుంటుందని, అదే కాకుండా పోలీసులు ప్రత్యేకంగా బందోబస్తు కూడా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

500 గ్రాముల గంజాయి పట్టివేత



పటాన్‌చెరులో ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్న అధికారులు

నర్సాపూర్/మనోరాబాద్, జూన్ 15: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం అరెస్ట్ చేసి, అతని వద్ద రూ.50 వేల విలువ చేసే గంజాయిని పట్టుకున్నారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మనోరాబాద్ మండలంలో ఇండస్ట్రియల్ ప్రాంతంలో అక్రమంగా ఒడిస్సాకు చెందిన అక్షయ్‌నాయక్ వద్ద గంజాయి ఉన్నట్లు సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ సీఐ నరేందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా పెట్టి అతని ఇంట్లో 500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్ఐ బాలయ్య, హెడ్ కానిస్టేబుళ్లు చంద్రయ్య, ఎల్లయ్య, రాజు, నరేష్, హరీశ్, రవి పాల్గొన్నారు.

ఎండు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

పటాన్‌చెరు రూరల్, జూన్ 15: ఎండు గంజాయి అమ్ముతున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన శనివారం ఇస్నాపూర్ తేజ కాలనీలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ పోలీసుల వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సాజిద్ ఇక్బాల్(34) ఎండు గంజాయి అమ్ముతున్నాడన్న సమాచారం మేరకు మెదక్ డివిజన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అతడి ఇంటిపై దాడిచేసి 60 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అందెశ్రీ రాకతో రేబర్తిలో సందడి



ఉపాధ్యాయులతో అందెశ్రీ

మద్దూరు, జూన్ 15: జయజయహే తెలంగాణ జననీ జయ కేతనం అంటూ రాష్ట్ర గీతాన్ని అందించిన ప్రముఖ కవి సినీగేయ రచయిత అందెశ్రీ రాకతో శనివారం మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామంలో సందడి నెలకొన్నది. జయజయహే గీతం రాష్ట్ర గీతంగా ప్రభుత్వం ప్రకటించిన అనంతరం మొదటిసారిగా గ్రామాన్ని సందర్శించడంతో చిన్ననాటి స్నేహితులు, గ్రామస్థులు అందెశ్రీని ఆప్యాయంగా పలకరించి స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని ఉన్నత పాఠశాలను చిన్ననాటి స్నేహితుడు శివయ్యతో కలిసి సందర్శించారు. ఉపాధ్యాయులతో కాసేపు ముచ్చటించారు. ఇంతమంది నాయకులున్నా దిక్కులేకుండా ఉన్న రేబర్తి పాఠశాల దుస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ చదువులమ్మ ఒడికి తనవంతుగా సాయమందించే ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఆయనవెంట హెచ్‌ఎంలు వరదరాజు, బస్వరాజు కనకయ్య, సెక్రటరీ మాదవ్‌జాదవ్‌తో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు. గ్రామంలో ఇటీవల తన చిన్ననాటి స్నేహితుడైన చిల్వారి భూపతిరెడ్డితో పాటు అందె యాదగిరి మృతి చెందారు. విషయం తెలుసుకున్న అందెశ్రీ శనివారం వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శివయ్య, ఎర్రబచ్చల బాలమల్లు జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, ఎండీ అలీమ్ పాల్గొన్నారు.

డీసీసీబీకి రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు

- స్వయం సహాయక సంఘాలకు లక్ష్యానికి మించి రుణాల పంపిణీ



మంత్రి దామోదర్ రాజనర్సింహను శాలువాతో సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, సీఈవో శ్రీనివాస్

సంగారెడ్డి టౌన్, జూన్ 15: ఉమ్మడి జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు లక్ష్యానికి మించి రుణాలు ఇచ్చినందుకు డీసీసీబీకి రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది. ఈ మేరకు హైదారబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి భవనంలో శుక్రవారం రాత్రి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా డీసీసీబీ సీఈవో శ్రీనివాస్ ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారంరాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహను డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, సీఈవో శ్రీనివాస్‌లు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అయితే ఉత్తమ అవార్డు పొందినందుకు డీసీసీబీ పాలకవర్గంతో పాటు అధికారులను మంత్రి అభినందించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ ద్వారా 7,500 స్వయం సహాయక సంఘాలకు రూ.450 కోట్ల బ్యాంకు లింకేజి రుణాలను అందజేశారు. రాష్ట్రంలోని అన్ని డీసీసీబీ బ్యాంకులను పోలిస్తే సంగారెడ్డిలోని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీకి ఈ అవార్డు లభించింది. ఉత్తమ అవార్డు అందుకున్న సందర్భంగా డీసీసీబీ అధికారులు, ఉద్యోగులను చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అభినందించారు.

హత్నూర మహిళా సంఘానికి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు

హత్నూర, జూన్ 15: మండల కేంద్రమైన హత్నూర గ్రామైక్య సంఘానికి బ్యాంక్ లింకేజీ రుణాల పంపిణీలో రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు దక్కించుకున్నారు. 2023-24 సంవత్సరానికిగాను సెర్ప్ కార్యక్రమంలో బ్యాంక్ లింకేజీలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఉత్తమ సంఘంగా ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రలో పంచాయతీరాజ్‌శాఖ ఈ అవార్డును హత్నూర గ్రామైక్య సంఘం బాధ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈవో అనితారామచంద్రన్, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు కే.రాణి, కార్యదర్శి అపర్ణ, ఐకేపీ సీసీ మహేష్, వీవోఏ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భార్యతో గొడవ పడి భర్త అదృశ్యం



మనోహర్(ఫైల్)

సంగారెడ్డి క్రైం, జూన్ 15: భార్యతో గొడవపడి భర్త ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఘటన జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో చోటు చేసుకున్నది. సంగారెడ్డి పట్టణ సీఐ ఎస్.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.... పట్టణంలోని నేతాజీనగర్‌కు చెందిన దప్పు మనోహర్(35) మిషన్ భగీరథలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 3న భార్య విజయలక్ష్మితో కుటుంబ విషయంలో గొడవపడ్డాడు. అదేరోజు సాయంత్రం 5 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కాగా 10న భార్య ఫోన్‌చేయగా మనోహర్ మాట్లాడినప్పటికీ తర్వాత నుంచి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. దీంతో భార్య తన భర్త ఆచూకీ తెలుసుకోవాలని కోరుతూ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో 08455 276333 లేదా 8712656718 నంబర్లకు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

అంగన్‌వాడీల ద్వారా కుటుంబ సర్వే

- మెదక్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బ్రహ్మాజీ



కొల్చారంలో అంగన్‌వాడీ టీచర్ల సర్వేలో బ్రహ్మాజీ

కొల్చారం, జూన్ 15: అంగన్‌వాడీలో ప్రత్యేక యాప్ ద్వారా కుటుంబ సర్వే జరుగుతుందని... సర్వే పూర్తి చేయడానికి ప్రజలు సహకరించాలని ఐసీడీఎస్ మెదక్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బ్రహ్మాజీ తెలిపారు. మండల కేంద్రమైన కొల్చారంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం తనిఖీ చేశారు. అనంతరం కొల్చారం గ్రామపంచాయతీ కార్యాలయంలో కొల్చారం సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లకు సర్వేపై ప్రత్యేక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మెదక్, రామాయంపేట, అల్లాదుర్గం, నర్సాపూర్ ప్రాజెక్టు పరిధిలో 1076 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లాలో 32 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 62 అంగన్‌వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక యాప్ ద్వారా కుటుంబ సర్వే జరుగుతుందన్నారు. ఆధార్‌కార్డును ప్రామాణికంగా తీసుకొని నమోదు చేస్తామని, దాంతో చిన్నారుల ఎత్తుకు దగ్గ బరువు ఉండేలా చర్యలు తీసుకోవచ్చున్నారు. అంగన్‌వాడీ చిన్నారులకు ఫ్రీ స్కూల్ బుక్స్, యూనిఫాంలు ప్రభుత్వం ఇస్తున్నదన్నారు. అంగన్‌వాడీలో పిల్లలను నమోదు చేసుకునేందుకు అంగన్‌వాడీ బాట, అలాగే ఐదేళ్లు పూర్తయిన వారిని పాఠశాలకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీనర్సమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను హత్యచేసిన కుమారుడికి రిమాండ్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకట్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

నర్సాపూర్, జూన్ 15: అడిగిన డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో తల్లిదండ్రులను హత్యచేసిన కొడుకును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ బి.వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మెదక్ జిల్లా నర్సాపూర్ సీఐ కార్యాలయంలో సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ పుష్పరాజ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం సాదుల్లనగర్‌కు చెందిన చాకలి కిష్టయ్య(75), నర్సమ్మ(70) భార్యాభర్తలు. వీరికి ముగ్గురు కుమారులు. ఇందులో లక్ష్మణ్ చిన్నవాడు. బొంతపల్లిలో నివాసముంటూ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. అయితే తల్లిదండ్రులు గతేడాది క్రితం వారి పేరిట ఉన్న భూమి అమ్మగా వచ్చిన డబ్బులు ముగ్గురు కుమారులకు ఇచ్చి.. కొంత వారి వద్ద ఉంచుకున్నారు. అయితే లక్ష్మణ్ జల్సాలకు అలవాటు పడి అప్పుల పాలై.. డబ్బులు ఇవ్వాలంటూ తల్లిదండ్రులను తరచూ ఒత్తిడి చేయగా.. వారు నిరాకరించేవారు. వారిని చంపితేనే డబ్బులు వస్తాయన్న చెడు ఆలోచన అతనిలో కలిగింది. దీంతో మే 17న సాదుల్లనగర్‌లో ఉండే తల్లిదండ్రులను బొంతపల్లిలో అద్దెకు ఉండే ఇంటికి తీసుకువచ్చాడు. 18న చంపాలనుకున్నా సమయం కుదరలేదు. మే 19న తిరిగి తల్లిదండ్రులను డబ్బులు డిమాండ్ చేశాడు. అందుకు వారు తిరస్కరించడంతో గొడవపడ్డాడు. ఇదే అదునుగా భావించి తల్లిదండ్రులు పడుకున్న సమయంలో ఇద్దరి గొంతునులిమి చంపేసి అమ్మ మెడపై ఉన్న మూడుతులాల బంగారు నగలను తీసుకున్నాడు. అదేరాత్రి తన కారులో ఇద్దరి మృతదేహాలను నర్సాపూర్ సమీపంలోని చెరువు వద్ద నిర్మానుష్య ప్రాంతంలో పొదల్లో పడేశాడు. అనంతరం తనవెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసి తగులబెట్టి వెళ్లిపోయాడు. జంట మృతదేహాలు పడి ఉన్న విషయం నర్సాపూర్ పోలీసులకు తెలియడంతో గుర్తుతెలియని వ్యక్తుల కింద సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ పుష్పరాజ్ కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ఈ క్రమంలో సాదుల్లనగర్ గ్రామస్థులకు కిష్టయ్య, నర్సమ్మ కనిపించడకపోవడంతో పాటు వారి కొడుకు లక్ష్మణ్ తీరు అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు లక్ష్మణ్‌ను అదుపులో తీసుకుని విచారించగా.. తల్లిదండ్రులను తానే హత్యచేశానని ఒప్పుకోవడంతో శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన సిబ్బంది ఉపేందర్, శ్రీకాంత్, పోచయ్యలను డీఎస్పీ అభినందించారు.

మూడు ప్రైవేట్ పాఠశాలలకు షోకాజ్ నోటీసులు

- డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, జూన్ 15: జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం అమ్ముతూ, అధిక ట్యూషన్, అడ్మిషన్ ఫీజులు వసూలు చేస్తున్న మూడు ప్రైవేటు పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. పటాన్‌చెరులోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్, శిశు విహార్ స్కూల్, అమీన్‌పూర్‌లోని శ్రీనిధి గ్లోబల్ స్కూళ్లకు షోకాజ్ నోటీసులు జారీచేసినట్టు పేర్కొన్నారు. జిల్లాలో ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలు ఈ విషయం గమనించి నిబంధనలు పాటించాలని సూచించారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఇంటింటి సర్వే



పీచేర్యగడితండాలో సర్వే నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి సందీప్

కోహీర్, జూన్ 15: మండల కేంద్రమైన కోహీర్‌తో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నాలుగురోజులుగా కార్యదర్శులు మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతీ ఇంటికి నీరు సరఫరా అవుతుందా..? ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా అనే అంశాలను తెలుసుకునేందుకు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేపట్టింది. ఐదురోజులుగా వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. కోహీర్ మండలంలో 13,645 కుటుంబాలు ఉండగా.. సగానికి పైగా కుటుంబాలకు నల్లా కనెక్షన్ లేదని, నల్లా కనెక్షన్ ఉన్న చాలా ఇళ్లకు నీళ్లు రావడం లేదని తెలిసింది. నీరు సరఫరా అవుతున్న కుటుంబాల సభ్యులు మిషన్ భగీరథ నీళ్లు తాగడం లేదని, వాటిని కేవలం ఇంటి అవసరాలకు మాత్రమే వినియోగిస్తున్నట్లు సర్వేలో గుర్తించారు.

అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

జహీరాబాద్, జూన్ 15: గ్రామాల్లో, పట్టణాల్లో అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది కలిసి సమన్వయంతో పనిచేయాలని ఐసీడీఎస్ రీజినల్ డైరెక్టర్(ఆర్డీడీ) మోతి అన్నారు. శనివారం పట్టణంలోని శాంతినగర్, రంజోల్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను, హెల్త్ సబ్ సెంటర్లను పరిశీలించి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు చిన్న పిల్లల నమోదు వివరాలను సక్రమంగా చేపట్టాలన్నారు. రికార్డులకు, ఆన్‌లైన్‌కు పొంతన ఉండేలా చూడాలని తెలిపారు. నమోదు సమయంలో ఇబ్బందులు ఏర్పడితే ఐసీడీఎస్ అధికారులను సంప్రదించి అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సునీత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చేర్యాలలో పట్టపగలే చైన్‌స్నాచింగ్

- మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరణ
- బైక్‌పై పరారైన నిందితులు



చైన్‌స్నాచింగ్‌కు పాల్పడి బైక్‌పై పరారవుతున్న ఆగంతకులు

చేర్యాల, జూన్ 15: చేర్యాల పట్టణంలో గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలే చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డారు. మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును అపహరించుకుని పరారయ్యారు. చేర్యాల మండలం కడవేరుగుకు చెందిన నరుకుల వీరమ్మ పట్టణ శివారులో నివసిస్తున్నది. శనివారం మధ్యాహ్నం స్థానిక హనుమాన్‌నగర్ కాలనీ సమీపంలోని తమ బంధువుల వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో ఇరువురు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వెంబడించారు. జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి పక్కనగల వాసవీ గార్డెన్స్ మూలమలుపు వద్ద వీరమ్మ మెడలో నుంచి సుమారు మూడున్నర తులాల బంగారు గొలుసుకుని లాక్కుని ఉడాయించారు. ఆమె అరుపులు విన్న చుట్టుపక్కల వారు పట్టుకునేందుకు ప్రయత్నించగా ఆగంతకులు పరారయ్యారు. వెంటనే విషయాన్ని పోలీసులకు తెలపడంతో చుట్టుపక్కలగల భవనాలలోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. బైక్ నడుపుతున్న వ్యక్తి హెల్మెట్ ధరించగా, వెనకల మరో యువకుడు ఉండటాన్ని గుర్తించారు. ఫుటేజీలలో బైక్ నంబర్‌ను గుర్తించడంతో దర్యాప్తు చేపట్టారు. పోలీసు సిబ్బంది రెండు బృందాలుగా వీడి ఆగంతకుల కోసం గాలిస్తున్నారు.

మల్లన్న ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి రీ-నోటిఫికేషన్

- ఈనెల 28 వరకు దరఖాస్తుకు అవకాశం
- గత మార్చిలోనే విడుదల
- ఎన్నికల కోడ్‌తో నిలిచిన ప్రక్రియ
- మళ్లీ రీ-నోటిఫికేషన్ విడుదల



మల్లన్న ఆలయ రాజగోపురం

చేర్యాల, జూన్ 15 : ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి దేవాదాయశాఖ ఇటీవల రీ నోటిఫికేషన్ విడుదల చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం జనవరిలో జరిగిన స్వామివారి కల్యాణానికి ముందు నాలుగు నెలల కాలపరిమితితో కూడిన పునరుద్ధరణ కమిటీని నియమించగా, గత మే 5వతేదీతో ఆ కాలపరిమితి ముగిసింది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా పలు ఆలయాల పాలకమండళ్ల నియామకానికి దేవాదాయశాఖ చర్యలు తీసుకుని గతమార్చి నెలలో నోటిఫికేషన్ విడుదల చేసింది. కానీ పార్లమెంటు ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియను నిలిపివేసింది. ఈనెల మొదటివారంలో ఎన్నికల కోడ్ ముగిసిన క్రమంలో మళ్లీ నోటిఫికేషన్ వెలువరిచింది. ఈనెల 28వ తేదీలోగా ఆసక్తిగల వారు హైదరాబాద్ దేవాదాయశాఖ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ మెదక్, సంగారెడ్డి జిల్లా దేవాదాయశాఖ కార్యాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఇదిలా ఉండగా, గత పునరుద్ధరణ కమిటీలో 20మందికి చోటు కల్పించిన క్రమంలో పలువురు ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వ్యవహరించారు. ఈనేపథ్యంలో కమిటీలో పలువురిని మార్చి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నకల్లో చిత్తశుద్ధిగా పనిచేసిన పలువురికి నూతనంగా అవకాశం కల్పించేందుకు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ఇప్పటికే జాబితా రూపకల్పన జరిపి ప్రతిదించడంతో అధికారిక ప్రకటన వెలువడటమే తరువాయి అని సమాచారం. తమ తమ గాడ్‌ఫాదర్‌లతో పార్టీ అధిష్ఠాన నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. గతంలో నియోజకవర్గ నేతలే ఖరారు చేసే పరిస్థితి ఉండగా, ప్రస్తుతం పలువురు మంత్రులు, పార్టీ ముఖ్యనేతలు దృష్టిసారించడం, మరో రెండువారాల పాటు సమయం ఉండటంతో కొద్దిరోజులక్రితం ప్రతిపాదించిన జాబితాలో స్వల్పమార్పులు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొన్నది. కాగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి సన్నిహితుడిగా మెదులుతున్న పర్వాటకం లక్ష్మారెడ్డికి మరోమారు చైర్మన్‌గా అవకాశం కల్పించనున్నట్లు ప్రచారం జరుగుతున్న క్రమంలో కమిటీలో ఎవరెవరికి చోటు కల్పించనున్నారని ఆసక్తికరంగా మారింది.

ఖేడ్‌లో నేషనల్ హైవే పనులు ప్రారంభం



ఖేడ్ మండలం జూకల్ శివారులో రోడ్డు పక్కన నరికిన చెట్లు

నారాయణఖేడ్, జూన్ 15: నిజాంపేట-నారాయణఖేడ్-బీదర్ 161 బీదర్ జాతీయ రహదారి విస్తరణ పనులు ఖేడ్ రెవెన్యూ డివిజన్ పరిధిలోనూ ప్రారంభమయ్యాయి. నిజాంపేట నుంచి ఖేడ్ మీదుగా న్యాల్‌కల్ మండలం డప్పూరు సమీపంలోని కర్ణాటక సరిహద్దు వరకు రెండు లైన్ల రోడ్డు విస్తరణకు రూ.513 కోట్లు మంజూరయ్యాయి. మనూరు మండలం పుల్‌కుర్తి బ్రిడ్జి దాటాక జహీరాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో రెండునెలల క్రితం విస్తరణ పనులు ప్రారంభమై కొనసాగుతున్నాయి. తాజాగా ఖేడ్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఖేడ్ మండలం జూకల్ శివారులోని డబుల్ బెడ్‌రూం గృహాల సమీపం నుంచి విస్తరణకు అడ్డుగా రోడ్డు పక్కన ఉన్న చెట్ల తొలగింపు పనులను చేపట్టారు. రోడ్డుకు ఇరు వైపులా ఉన్న చెట్లను నరికి వేస్తున్నారు. ఏడాదిలోగా విస్తరణ పనులు పూర్తిచేసే దిశగా పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

మహిళా సంఘాల బలోపేతానికి ప్రత్యేక దృష్టిసారించాలి

● డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు

నర్సాపూర్, జూన్ 15: గ్రామాల్లో మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతయ్యేందుకు ఐకేపీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలి డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ ఐకేపీ కార్యాలయంలో సీసీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో మహిళా సంఘాల పనితీరుతో పాటు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సంస్థాగత నిర్మాణం తదితర అంశాలపై క్షుణ్ణంగా సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన సహాయం అందించి, తగిన శిక్షణ ఇచ్చేవిధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు రైతులను ఇబ్బందులకు గురిచేయడం తగదు

● హామీలు నెరవేర్చడంలో పక్క రాష్ట్ర సీఎంను చూసి మారండి

● నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునితారెడ్డి

నర్సాపూర్/శివ్వంపేట, జూన్ 15: ఓ వైపు ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తామంటూ గొప్పలు చెప్పుకుంటుండగా.. మరోవైపు బ్యాంకు అధికారులు రైతుల జీవితాలతో ఆడుకోవడం ఎంతవరకు సమంజసమని ఎమ్మెల్యే సునితారెడ్డి ప్రశ్నించారు. శనివారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో సహకార బ్యాంకు అధికారులు రైతులు రుణాలు కట్టడం లేదంటూ ఏకంగా పొలాల్లో ఫ్లెక్సీల ఏర్పాటు చేసి వారిని అవమానపర్చడం విచారకరమన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాలయాపన చేయడం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాడని, వారిని చూసైనా బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయం, రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తుందని తెలిపారు. ఇప్పటికే వర్షాకాలం పంటలు వేయడంలో రైతులు నిమగ్నమవుతుండగా పెట్టుబడికి రైతుభరోసా డబ్బులు ఇంకా ఎందుకు వేయడం లేదన్నారు. వెంటనే డబ్బులు వేసి రైతులను ఆదుకోవాలని సునితారెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మన్సూర్, సీనియర్ నాయకులు సత్యంగౌడ్, హుస్సేన్, రింగుల ప్రసాద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సునితారెడ్డి అన్నారు. శనివారం శివ్వంపేట మండలం చెన్నాపూర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన అక్షరాభ్యాసానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులచే అక్షరాలు దిద్దించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బుచ్యానాయక్, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మన్సూర్, నాయకులు చంద్రాగౌడ్, యాదగౌడ్, మహేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు లేక నిలిచిపోయిన పనులు

● చేపట్టిన పనులకు విడుదల కాని నిధులు

● మధ్యలోనే పనులు ఆపేసిన కాంట్రాక్టర్



చాంద్‌ఖాన్‌పల్లిలో నిలిచిపోయిన పాఠశాల నిర్మాణ పనులు



వినియోగానికి అనువుగా లేని పాఠశాలలోని టాయ్‌లెట్స్

నారాయణఖేడ్, జూన్ 15: పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం గత ప్రభుత్వం మన ఊరు-మనబడి కార్యక్రమాన్ని ప్రారంభించినా నిధులు లేక అభివృద్ధి పనులు అసంపూర్తి దశలో కొట్టుమిట్టాడుతున్నాయి. నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలోని ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అదనపు గదుల, ప్రహరీ నిర్మాణానికి మూడేళ్ల క్రితం రూ.42 లక్షలు మంజూరయ్యాయి. దీంతో కాంట్రాక్టర్ పాఠశాల గదుల నిర్మాణం పనులను చేపట్టారు. స్లాబ్ పూర్తయిన అనంతరం ప్రహరీ అధ్వానంగా మారడంతో దానిని తొలగించారు. టాయిలెట్స్ బ్లాక్ కూడా వినియోగానికి అనువుగా లేకపోవడంతో, దాని పనులు కూడా చేపట్టలేదు. పనులు చేపట్టినంత వరకు నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను అసంపూర్తి దశలోనే వదిలేశాడు. దీంతో రెండు గదుల్లోనే ఐదు తరగతుల వరకు బోధన చేయాల్సి వస్తుంది. మధ్యాహ్న భోజనం గది ఉన్నప్పటికీ.. అందులో వంట వండితే పొగ వెళ్లే సౌకర్యం లేకపోవడంతో కార్మికులు నరకయాతన అనుభవిస్తున్నారు. కొద్దిపాటి వర్షం వచ్చినా గది కారడంతో సరుకులు తడుస్తున్నాయన్నారు. ఏఈ రాకేష్‌ను వివరణ కోరగా.. 'మనఊరు-మన బడి' ద్వారా నిధులు మంజూరుకావడంతో స్లాబ్ పనులు జరిగాయి. మిగతావి నిధులు విడుదల కాగానే చేయిస్తామన్నారు.



కవేలి గ్రామ ప్రధాన రహదారి పక్కన ప్రమాదకరంగా ఓ విద్యుత్ స్తంభం ఒరిగి ఉంది. కోహీర్‌కు వెళ్లే ప్రధాన రహదారి ఉండడంతో.. ఆ దారి గుండా వెళ్లే ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. అలాగే కవేలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక భాగం నుంచి ఓహెచ్ఆర్ వాటర్ ట్యాంక్ వరకు ఉన్న పలు విద్యుత్ స్తంభాలు కూడా ఒరిగి ఉన్నాయి. విద్యుత్ అధికారులు స్పందించి సరిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- కోహీర్

విద్యుత్ తీగలు తెగి పడి రెండు గేదెలు మృతి



మృతిచెందిన గేదె వద్ద బాధితుడు

చిలప్‌చెడ్,జూన్ 15: విద్యుత్ తీగలు తెగి పడడంతో రెండు గేదెలు మృతిచెందాయి. చిలప్‌చెడ్ గ్రామానికి చెందిన మల్లుగల్ల సాయిలుకు చెందిన రెండు గేదెలు మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తెగిపడడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. తమ కుటుంబానికి జీవనాధారంగా ఉన్న గేదులు మృతి చెందడంతో రూ.1.80 లక్షలు నష్టపోయానని తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు. కాగా సంఘటనా స్థలాన్ని విద్యుత్ అధికారులు రాములు, రూప్‌సింగ్, మదన్, స్వామి పరిశీలించారు.

ఫారెస్ట్ వాచర్‌పై దాడిచేసిన ముగ్గురిపై కేసు

శివ్వంపేట, జూన్ 15: అటవీశాఖలో పనిచేస్తున్న వాచర్‌పై దాడిచేసిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని వెంకటాపూర్ సెక్షన్ పరిధిలోని శివ్వంపేట మండలం కొత్తపేట రూప్లాతండాకు చెందిన కట్రోత్ సురేష్ పశువులను మేపుతుండగా వాచర్ జెరుపుల రాములు ఫారెస్ట్‌లో మొక్కలు ఉన్నాయని, పశువులను అడవిలోకి తీసుకురావద్దని సురేష్‌కు చెప్పాడు. దీంతో సురేష్ మామ రాము వాచర్ రాములు, కాట్రోత్ రెడ్యా, కోంటీలు కర్రలతో దాడిచేయడంతో రాములు తలకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు రాము, రెడ్యా, కోంటీలపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి

● బీజేపీ బొల్లారం పట్టణ అధ్యక్షుడు ఆనందకృష్ణారెడ్డి

జిన్నారం, జూన్ 15: బొల్లారం మున్సిపాలిటీలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని బీజేపీ బొల్లారం పట్టణ అధ్యక్షుడు ఆనందకృష్ణారెడ్డి ఆరోపించారు. స్థానిక హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు గోదాం వెనక ప్రాంతంలో కొందరికి సిలిండర్ ధరపై అధిక డబ్బులు తీసుకుంటూ పంపిణీ చేస్తున్నారని తెలిపారు. అర్హులైన లబ్ధిదారుల నివాసాలకు గ్యాస్ సరఫరా చేయకుండా బ్లాక్ మార్కెట్‌లో అదనపు ధరకు విక్రయిస్తున్న ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని, ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని శనివారం తెలిపారు.

భక్తులతో కొండాపూర్ హనుమాన్ ఆలయం కిటకిట



కొండాపూర్ హనుమాన్ ఆలయంలో భక్తుల సందడి

నారాయణఖేడ్, జూన్ 15: మండల పరిధిలోని చరిత్రాత్మకమైన కొండాపూర్ హనుమాన్ ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. కొండాపూర్ శివారులో హన్మంతుడు స్వయంభువుగా వెలిశాడు. ప్రతి శనివారం ఖేడ్ ప్రాంత భక్తులే కాకుండా దూర ప్రాంతాల నుంచి హన్మంతుడిని దర్శించుకోవడానికి వస్తారు. ఈ సందర్భంగా ఉదయం అభిషేకం, చందనం, మహాహారతి, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దాతల సహకారంతో మహాప్రసాదాన్ని అందించారు. ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ భక్తులకు ఆశీస్సులు అందించారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవీరెడ్డి

మాసాయిపేట, జూన్ 15: అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవీరెడ్డి పేర్కొన్నారు. శనివారం మాసాయిపేట మండలంలోని అంగన్‌వాడీ-5 కేంద్రంలో సిబ్బందితో శిక్షణ నిర్వహించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంతో పాటు గర్భిణులకు మేలైన ఆహారం అందిస్తున్నామని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మంచినీరు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, తదితర మౌలిక వసతులు ప్రభుత్వపరంగా అందేలా చూస్తామని తెలిపారు.

'సఫాయి కార్మికుల సమస్యలను పరిష్కరించాలి'

చేగుంట, జూన్ 15: చేగుంట మండలంలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలతో పాటు సమస్యల పరిష్కారాన్ని కృషిచేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి అన్నారు. శనివారం ఈ విషయమై తహసీల్దార్ గియాస్సినిసాబేగంకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వివిధ గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు నాలుగైదు నెలల నుంచి వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రాజు, నర్సమ్మ, నాగరాజు, మల్లయ్య పాల్గొన్నారు.

గ్రామపంచాయతీకి వెళ్లే రోడ్డు చూపాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఢాక్యాతండావాసులు

పాపన్నపేట, జూన్ 15: మండల పరిధిలోని ఢాక్యాతండాలో గ్రామ పంచాయతీ వైపు వెళ్లేందుకు రోడ్డు చూపాలని కోరుతూ తండావాసులు శనివారం తహసీల్దార్ లక్ష్మణ్‌బాబుకు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీ కార్యాలయం వైపు వెళ్లేందుకు 75 ఏళ్లుగా ఒక దారిని వినియోగిస్తున్నామన్నారు. పదిరోజులుగా ఆ దారి మధ్యలో సంబంధిత స్థలం యజమాని ఎవరు వెళ్లకుండా కంచె వేశారన్నారు. దీంతో పనుల నిమిత్తం గ్రామపంచాయతీకి వెళ్లేందుకు ఇబ్బంది అవుతుందన్నారు. అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందులో మాజీ సర్పంచ్ హీరాలాల్, భగ్య, రాజు, వినోద్, తదితరులున్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎస్‌ఐ

పెద్దశంకరంపేట/రేగోడు, జూన్ 15: పండుగలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని పెద్దశంకరంపేట ఎస్‌ఐ శంకర్‌పేర్కొన్నారు. శనివారం పెద్దశంకరంపేటలోని పోలీస్‌స్టేషన్‌లో బక్రీద్ పండుగను పురస్కరించుకుని హిందువులు, ముస్లిముల మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీ వీణాసుభాష్‌గౌడ్, రాయిని మధు, దానంపల్లి, నారాగౌడ్, రాజేందర్‌గౌడ్, పోలీసులు పాల్గొన్నారు. పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ రాజయ్య, ఏఎస్‌ఐ మల్లయ్య తెలిపారు. శనివారం రేగోడు పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.

కాలుష్య సమస్యపై నేడు కాజీపల్లిలో సమావేశం

జిన్నారం, జూన్ 15: కాజీపల్లి ప్రాంతంలోని పరిశ్రమల కాలుష్య నియంత్రణపై పోరాటానికి జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేస్తామని నాయకులు రమాకాంత్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కాలుష్య సమస్యపై 16న కాజీపల్లిలో సమావేశం నిర్వహిస్తున్నామని, స్థానిక ప్రజలు, నాయకులు పాల్గొని అభిప్రాయాలు తెలుపాలని పేర్కొన్నారు.

సమాచారం

'సురేష్ షెట్కార్‌కు టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి'

నారాయణఖేడ్, జూన్ 15: జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్‌కు టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని నిజాంపేట మండల కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షులు సీమాన్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. సురేష్‌షెట్కార్ అన్నివర్గాలకు సమప్రాధాన్యత ఇస్తారని, అందువల్ల అధ్యక్షపదవి ఇవ్వాలని కోరారు.

జీలుగ పంటల పరిశీలించిన ఏవో

తూప్రాన్, జూన్ 15: తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్, రావెల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన జీలుగ పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి గంగుమల్లు వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష్‌కుమార్‌తో కలిసి పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు.

ఉప ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు

జిన్నారం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదినం సందర్భంగా బొల్లారం కార్మిక సంఘం నాయకులు వరప్రసాద్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శనివారం ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నాలాలపై నిర్మాణాలు చేపడితే చర్యలు

● మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి



అల్గోల్‌రోడ్డుపై నిర్మిస్తున్న బ్రిడ్జిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

జహీరాబాద్, జూన్ 15: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో నాలాలపై, మురుగు కాలువలపై నీటి ప్రవాహానికి అడ్డంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పలు కాలనీల్లో నాలాలను, మురుగునీరు ప్రవహించే కాలువలను పరిశీలించి మాట్లాడారు. నాలాలపై నీటి ప్రవాహాలకు అడ్డంగా నిర్మాణాలు చేపడితే తొలగిస్తామన్నారు. నీటి ప్రవాహాలకు అడ్డంగా నిర్మాణాలు చేపట్టడం మూలంగా వర్షపునీరు, మురుగునీరు ముందుకెళ్లకుండా.. పక్కనున్న నివాసాల్లోకి వెళ్లే అవకాశం ఉన్నదన్నారు. తాము ఇప్పటివరకు అక్కడక్కడ నాలాలు, కాలువలపై అక్రమ నిర్మాణాలను గుర్తించామని, త్వరలో వాటన్నింటిని తొలగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సంధ్యారాణి, మున్సిపల్ అధికారులు రవీందర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెప్సీ పరిశ్రమలో సీఐటీయూ ఘన విజయం



విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

సంగారెడ్డి రూరల్, జూన్ 15: సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని వరుణ్ బేవరేజెస్ (పెప్సీ) పరిశ్రమలో జరిగిన కార్మిక యూనియన్ ఎన్నికల్లో సీఐటీయూ ఘన విజయం సాధించింది. యూనియన్ నుంచి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, హెచ్‌ఎంఎస్ తరపున ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సదానందగౌడ్ బరిలో నిలిచారు. పరిశ్రమలో 201 మంది కార్మికులు ఓటు హక్కు కలిగి ఉండగా.. 199 మంది పోలింగ్‌లో పాల్గొన్నారు. సీఐటీయూకు 129 ఓట్లు రాగా.. హెచ్‌ఎంఎస్‌కు 70 ఓట్లు వచ్చాయి. సదానందగౌడ్‌పై చుక్క రాములు 59 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. పరిశ్రమ ఎదుట కార్మికులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ 22 ఏళ్లుగా సీఐటీయూ పెప్సీ పరిశ్రమలో విజయం సాధిస్తూ కార్మికుల హక్కులను కాపాడిందని గుర్తు చేశారు. పరిశ్రమ యాజమాన్యం చట్ట ప్రకారం జరగాల్సిన ఎన్నికలను కూడా ఆపాలని కుట్ర చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు, యూనియన్ ప్రధాన కార్యదర్శి బాలరాజు, రవీందర్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, శివ, సనుధాకర్, సురేష్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నవాయతన రామశిలా యాత్రకు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లు చేస్తున్న సభ్యులు

సంగారెడ్డి రూరల్, జూన్ 15: జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో ఆశ్రమ వ్యవస్థాపకుడు మహేశ్వరశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో 16న నిర్వహించే నవాయతన రామశిలా యాత్రను వైభవంగా నిర్వహించేందుకు ఆశ్రమంలో సభ్యులు ఏర్పాట్లు చేశారు. ప్రకాశం జిల్లా కొండాయపాలెం నుంచి ఈ యాత్ర కొనసాగి శనివారం పటాన్‌చెరు నియోజకవర్గం రుద్రారం మండలం గణేష్‌గడ్డలోని గణేశ్ ఆలయానికి చేరుకున్నది. ఆలయంలో పూజలు చేసి కవలంపేట గ్రామం నుంచి కంది మీదుగా సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని శివాలయానికి చేరుకున్నది. 16న శివాలయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు యాత్ర ప్రారంభమై ఆశ్రమానికి చేరుకుంటుందని సిద్ధాంతి తెలిపారు.

నిమ్జ్ భూముల్లో పంటలను సాగుచేయొద్దు: తహసీల్దార్

ఝరాసంగం, జూన్ 15: ఝరాసంగం మండల పరిధిలోని ఎల్గోయి, బర్దీపూర్, చీలపల్లి తదితర గ్రామాల్లోని నిమ్జ్ ప్రతిపాదిత వ్యవసాయ భూముల్లో రైతులు పంటలను సాగు చేయొద్దని తహసీల్దార్ సంజీవరావు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ నిమ్జ్ ప్రాజెక్టు కింద మూడు గ్రామాల్లో భూములను సేకరించామన్నారు. పంటలను సాగుచేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. పంటలను సాగుచేస్తే పరిశ్రమలను నిర్మిస్తున్న క్రమంలో తొలగించాల్సి ఉంటుందనే విషయాన్ని రైతులు గమనించాలన్నారు. ఆర్‌ఐ రామారావు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధిలో ప్రత్యేక చొరవ చూపాలి

● ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాములు

జహీరాబాద్, జూన్ 15: గ్రామాల అభివృద్ధిలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాములు పేర్కొన్నారు. శనివారం ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధశాఖలకు చెందిన అధికారులు వారివారి నివేదికలను చదివి వినిపించారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నందున అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అలాగే వర్షాకాలం ప్రారంభమైనందున ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా వైద్య సిబ్బంది దృష్టి పెట్టాలని తెలిపారు. కొత్తపాలక వర్గం ఏర్పాటయ్యే వరకు ప్రత్యేకాధికారులు గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నాగిశెట్టి రాథోడ్, ఎంపీడీవో మాధవరెడ్డి, ఆయా శాఖలకు చెందిన అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

50 పడకల ఈఎస్‌ఐ ఆస్పత్రిని నిర్మించాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి మైపాల్



మాట్లాడుతున్న మైపాల్

జహీరాబాద్, జూన్ 15: జహీరాబాద్ పట్టణంలో కార్మికులు, పరిశ్రమలు అధిక సంఖ్యలో ఉన్న నేపథ్యంలో వారి ఇబ్బందులను గుర్తించి 50 పడకల ఈఎస్‌ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మైపాల్ పేర్కొన్నారు. శనివారం ఈఎస్‌ఐ ఆస్పత్రిని తిరిగి తెరవడంతో ఆస్పత్రికి వచ్చి పలువురు కార్మికులతో మాట్లాడారు. సీఐటీయూ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేపట్టి ఆస్పత్రిని తెరిపించామన్నారు. పట్టణంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి రెండునెలల తర్వాత తెరుచుకోవడంతో కార్మికులకు ఉపయోగకరంగా మారిందన్నారు. ప్రతినెల జహీరాబాద్ ప్రాంతం నుంచి కార్మికుల ద్వారా రూ.20లక్షలకు పైగానే ఈఎస్‌ఐకి వెళ్తుంటాయన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులను తక్షణమే ఇవ్వాలి

● ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్

కొల్చారం, జూన్ 15: ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను వెంటనే ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొల్చారంలో శనివారం ఆయన కొంతమంది లబ్ధిదారులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు మూడునెలల ముందే కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరుచేసినా.. ఇన్‌చార్జి మంత్రి టైం ఇవ్వకపోవడంతో చెక్కుల పంపిణీని అధికారులు నిలిపేయడం తగదన్నారు. కలెక్టర్ చర్యలు తీసుకుని రెండురోజుల్లో లబ్ధిదారులకు చెక్కులు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

గోవధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

● జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్ జగన్



డీఎస్పీకి వినతిప్రతం అందజేస్తున్న బీజేపీ నాయకులు

జహీరాబాద్/మనోహరాబాద్/చేగుంట/వెల్దుర్తి/కౌడిపల్లి/అల్లాదుర్గం, జూన్ 15: ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను దృష్టిలో పెట్టుకుని జహీరాబాద్ ప్రాంతంలో గోవధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్ జగన్, జిల్లా, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పేర్కొన్నారు. సోమవారం బక్రీద్ పర్వదినాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో కుర్బానీ పేరుతో కొనసాగే గోవులవధను నిలిపివేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువుల ఆరాధ్యదైవంగా భావించే గోమాతలను (పశువులను) కుర్బానీ పేరుతో వధించడంపై వారు విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజేందర్‌రెడ్డి, సుధీర్‌బండారీ, విశ్వనాథ్‌స్వామి పాల్గొన్నారు. బక్రీద్ రోజు గోవధ జరగకుండా చూడాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. తూప్రాన్ ప్రఖండ ప్రముఖ్ ర్యాకల అనిల్‌గౌడ్ ఆధ్వర్యంలో మనోహరాబాద్ తహసీల్దార్, పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. గోవధన నిర్మూలించాలని విశ్వహిందూ పరిషత్, దేబీ గోవంశ రక్షణ సంవర్ధన సమితి ఆధ్వర్యంలో శనివారం చేగుంట తహసీల్దార్ గియాస్సినిసాబేగం, పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. గోవులను హింసించి, చంపేవారిపై చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ మండలాధ్యక్షుడు చందునేత అన్నారు. తహసీల్దార్ తులసీరామ్‌కు, ఎస్‌ఐ నవతాగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. గోవుల అక్రమ రవాణాను, గోవధను అరికట్టాలని బీజేవైఎం ఆధ్వర్యంలో కౌడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. బక్రీద్ సందర్భంగా గోవధ చేయొద్దని అల్లాదుర్గం ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎస్పీ బాలస్వామి ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు.

గ్రామీణ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మృతుడి భార్యకు చెక్కు అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

రాయికోడ్, జూన్ 15: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ అందిస్తున్న సేవలను ప్రతీ ఖాతాదారుడు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఏపీజీవీబీ రాయికోడ్ బ్రాంచ్ మేనేజర్ సురేంద్ర అన్నారు. శనివారం మండల కేంద్రమైన రాయికోడ్, మండల పరిధిలోని ఇటికేపల్లి గ్రామానికి చెందిన జమలాపూర్ నర్సింహులు ప్రమాదవశాత్తు మృతిచెందాడు. కాగా అతను ఏపీజీవీబీ బ్యాంకులో జనరల్ పర్సనల్ ఆక్సిడెంటల్ ఇన్సూరెన్స్ చేసుకున్నారు. ఆ ఇన్సూరెన్స్ క్లైమ్ ద్వారా వచ్చిన రూ.20 లక్షలను నామినీగా ఉన్న నర్సింహులు భార్య జమలాపూర్ తుల్జమ్మకు ఏపీజీవీబీ మేనేజర్ సురేంద్ర అందజేశారు.